# తండ్రి పాత్ర

- వి.వి.సుబ్బరాజు

"అమ్మా! ఈ నాటకాలరాయుడిని భరించడం మావల్లకాదు" అంటున్నాడు పెద్దకొడుకు చైతన్య.

"ఈ కప్పులు, చిప్పలు... ఎందుకమ్మా ఇంటినిండా అడ్డంగా! ఏ పాత సామానుల వాడికో పారెయ్యి" అంటున్నాడు చిన్నకొడుకు కిరణ్.

ఐదు దశాబ్దాలుగా తాను రంగస్థలం మీద అందుకున్న పురస్కారాలకు చిహ్నాలైన జ్ఞాపికలు వాడి దృష్టిలో ఇంటిలో పనికిరాని అడ్డంగా వున్న వస్తువులైపోయాయి. ఆరుబయట కుర్చీలో కూర్చున్న ప్రసాదమూర్తికి కన్నబిడ్డలు తల్లితో అంటున్న మాటలు స్పష్టంగా వినబడుతూనే వున్నాయి. వాళ్ళ ఉద్దేశ్యం కూడా తండ్రి వినాలన్నదే కావడంవల్లనేమో గొంతు పెంచి మరీ మాట్లాడుతున్నారు.

అక్కడే వుండి వాళ్ళ మాటలు వినే సహనం ప్రసాదమూర్తికి లేకపోయింది. రోడ్డు మీదకి వచ్చేసాడు.

ప్రసాదమూర్తి నెల క్రిందటే ఉద్యోగ విరమణ చేసాడు. కొడుకులిద్దరూ హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. పెద్దకొడుకు చైతన్య బ్యాంక్ క్లర్క్, చిన్నకొడుకు కిరణ్ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. తల్లిదండ్రులను తమతో తీసుకువెళ్ళే విషయంలో జరుగుతున్న తర్జనభర్జనల ఘట్టం అది.

రంగస్థలంమీద వందలాది నాటకాలలోని పాత్రల్ని అర్థం చేసుకుని నటించి మెప్పించిన ప్రసాదమూర్తికి కొడుకుల ఆంతర్యం స్పష్టంగానే అర్థమయింది.

ఇక వచ్చిన చిక్కల్లా భార్య ఆదిలక్ష్మి గురించే. ఉద్యోగ విరమణ తరువాత పూర్తిగా రంగస్థలానికి దూరంగా ఉండాలనీ, తమ పిల్లలతో, మనుమల దగ్గర చివరిరోజులు సంతోషంగా గడపాలన్నది ఆదిలక్ష్మి కోరిక. ప్రసాదమూర్తిని ఆ మేరకు ఒప్పించగలిగింది.

కొడుకుల మాటలు అందుకు సానుకూలంగా లేవు. మరో రెండు గంటల వ్యవధిలో తమ నిర్ణయం ప్రకటించి ట్రైన్‌కి వెళ్ళిపోతారు. వాళ్ళు వెళ్ళిన తరువాతనే ఇల్లు చేరుకోవాలనుకున్నాడు ప్రసాదమూర్తి.

ప్రసాదమూర్తి ఉద్యోగం చేసినది ఓ ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ కావడంవల్ల పెన్షన్ సదుపాయంలేదు. ఉద్యోగ విరమణ తరువాత వచ్చిన మొత్తం చదువులకు, పిల్లల పెళ్ళిళ్ళకు, గతంలో వైద్యం నిమిత్తం అయిన ఖర్చులకు చేసిన అప్పులకు సరిపోయింది.

ఇక ప్రసాదమూర్తి, ఆదిలక్ష్మి దంపతులు పిల్లలమీదనే ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది.

ప్రసాదమూర్తికి కొడుకులు తన గురించి తక్కువ చేసి మాట్లాడడం జీర్ణించుకోలేకపోతున్నాడు. అవమానకరంగా వుంది. ఇటువంటి ఛీత్కారాలకి గురి కావాల్సి వస్తుందని ఊహించలేదు. ఇది తన పెంపకం లోపమా? లేక మారుతున్న కాలం ప్రభావమా? అన్న మీమాంసలో పడ్డాడు.

తన కొడుకులిద్దరినీ ప్రయోజకులుగా తమ కాళ్ళమీద తాము నిలబడగలిగిన స్థాయి కల్పించడంలో తాను సఫలీకృతుడయ్యాడు. అది తన బాధ్యత మాత్రమేకాదు, విద్యుక్త ధర్మంగా భావించాడు.

తాను ఓ సమర్థుడైన తండ్రిగా తన బాధ్యతలు నిర్వహించగలిగానని సగర్వంగా నలుగురి మధ్యా చెప్పుకుని మురిసిపోయేవాడు. కానీ పిల్లలు... కృతఘ్నులు. వాళ్లమీద ఆధారపడకూడదు. ఈ కాలం తల్లిదండ్రులు తమ పిల్లలు వృద్ధాప్యంలో అక్కరకు వస్తారని ఆశపడకూడదు. చాలా ముందు చూపుతో ఉండాలి. లేకుంటే హీనంగా చివరిరోజులు గడపవలసి వస్తుంది. తల్లులూ, తండ్రులూ మేల్కోండి. భ్రమలు వదులుకోండి! అని ఎలుగెత్తి అరవాలనిపించింది ప్రసాదమూర్తికి. ఏమైనా పిల్లల మీద ఆధారపడకూడదు అన్న నిర్ణయానికి వచ్చేసాడు. ఎలా? షుగరు, బిపి తనకున్న ఆరోగ్య సమస్యలు. వేరే ఉపాధి వెతుక్కోవాలి అన్న ఆలోచనలు అతనిలో రకరకాలుగా పరుగులు తీస్తున్నాయి.

***

ప్రసాదమూర్తి తన పది సంవత్సరాల వయస్సులోనే రంగస్థలంమీద అడుగుపెట్టాడు. హరిశ్చంద్ర నాటకంలో లోహితాసుడు పాత్ర వేసే నటుడు అందుబాటులో లేకపోవడంవల్ల వాళ్ళ గ్రామంలోని నాటక సమాజం వాళ్ల దృష్టి ప్రసాదమూర్తిమీద పడింది.

కనుముక్కు తీరు అందంగా వున్న ప్రసాదమూర్తిని బ్రతిమిలాడి బలవంతంగా స్టేజీ ఎక్కించారు. నాటకం విజయవంతమయింది. ప్రసాదమూర్తిని "బాగా చేసావు! అద్భుతం" అంటూ ప్రశంసల జల్లు కురిపించారు.

ప్రేక్షకులు, సహనటులు పొగడ్తలు ప్రసాదమూర్తికి ఊపిరాడనివ్వలేదు. ఆ ప్రోత్సాహం అతనిలో నటనపై మక్కువ పెంచింది. ఇక నటన అతనికి ప్రాణ సమానమయింది.

నాటకాల పిచ్చివల్ల చదువు కుంటుపడింది. స్కూలుఫైనలుతో చదువుకు స్వస్తిచెప్పి బ్రతుకు బండి లాగడానికి ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో గుమస్తాగా చేరాడు. ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ యజమాని సూర్యారావుగారు మంచి కళాపోషకులు. ప్రసాదమూర్తిలోని మహానటుడ్ని చూసి ప్రోత్సహించారు.

తన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ పేరిట ఓ నాటక సమాజం ఏర్పాటుచేసి తన కంపెనీ పేరు ప్రాచుర్యంలోకి తెచ్చేలా చేసుకున్నారు.

ప్రసాదమూర్తి నటనాభిలాషకు ఉద్యోగం ఓ వరప్రసాదంలా దొరికింది. దేశవ్యాప్తంగా నాటక పరిషత్తులలో పాల్గొని ఉత్తమ నటుడిగా, ప్రయోక్తగా ప్రశంసలు అందుకుంటూ ఉత్తమ రంగస్థల నటుడిగా ఆంధ్రదేశమంతా కీర్తి ప్రతిష్ఠలు గడించాడు.

రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ రంగస్థల నటుడిగా నంది అవార్డులు పొందాడు. తాను పని చేస్తున్న కంపెనీ పేరు బాగా ప్రాచుర్యంలోకి తీసు

కువచ్చినందుకు యాజమాన్యం ప్రత్యేక అభిమానం సంపాదించాడు.

ప్రసాదమూర్తి నటనా సామర్థ్యాన్ని చూసి సినీ రంగానికి రమ్మని ఒకరిద్దరు దర్శకులు ఆహ్వానించినా వెళ్లే సాహసం చేయలేదు. ఉన్న ఉద్యోగం వదులుకుని రోడ్డున పడవలసి వస్తుందేమోనని భయం. పిల్లల భవిష్యత్తు పాడవుతుందేమోనన్న ఆందోళనలవల్ల ఆ రంగంవైపుకు మొగ్గు చూపలేదు.

★★★

తన తండ్రి పాత్ర పిల్లలకు నచ్చలేదు. తనని ఓ నాటకాలరాయుడు అంటున్నారు. అదే సాకుగా చూపించి తనను వెలి వేస్తున్నారు. ప్రసాదమూర్తి మనసులోనే మదనపడుతూ పార్కు బెంచీ మీద కూర్చున్నాడు.

ప్రసాదమూర్తి ఆలోచనలు భార్య మీదకు మళ్లాయి. పిల్లల మాటలకు ఆ తల్లి మనసు ఎంత గాయపడిందో! అమాయకురాలు. తన నాటకాల మిత్రులు, రచయితలు ఎంతమంది ఇంటికి వచ్చినా వేళాపాళా అని లేకుండా నిముషాలలో వాళ్లకు కావలసినవన్నీ విసుగు లేకుండా అమర్చేది.

అతిధి మర్యాదలకు తనకు తానే సాటి అనిపించుకుంది. కానీ ఈ రోజు కొడుకులు, కోడళ్ల చేతి క్రింద బ్రతకవలసి రావడం భయంగా వుంది.

కొడుకుల తీర్పు ఏ విధంగా వుంటుందో ఊహించగలిగినా దానికి ఆమె తట్టుకోగలుగుతుందో లేదోనన్న సందేహం వేధిస్తోంది ప్రసాదమూర్తిని.

ప్రసాదమూర్తి ఇంటికి చేరేసరికి గుమ్మంలోనే జారగిలబడి శూన్యంలోకి చూస్తూ ఆదిలక్ష్మి దర్శనమిచ్చింది.

"వాళ్ళు వెళ్లారా?" అడిగాడు ప్రసాదమూర్తి.

"ఆ... వెళ్లారు. మీరు ఎటు వెళ్లారు? సాయంకాలం టీ కూడా తీసుకోలేదు. పిల్లలు మీ కోసం చూసి చూసి వెళ్లారు. రండి వేడిగా భోజనం చేద్దాం" అంటూ ఆ ప్రయత్నంలోకి దిగింది.


ప్రసాదమూర్తి భోజనం చేస్తుండగా "మనం కొత్త ప్రదేశంలో ఇమడడం కష్టం అంటున్నారు పిల్లలు. మనకు ప్రతినెలా అవసరాలకు సరిపడా మొత్తం పంపిస్తామన్నారు. మనం ఇక్కడే ఉండిపోదామండీ" అంది ఆదిలక్ష్మి తన ముఖంలోకి భావాలు భర్తకు కనబడకుండా పక్కకు తిరిగి మరో పనిలో నిమగ్నమవుతూ.

పిచ్చి ఇల్లాలు. తాను ఎక్కడ బాధపడతానోనని తన దిగులును కప్పి పుచ్చుకునే ప్రయత్నం చేస్తోంది అనుకున్నాడు ప్రసాదమూర్తి.

"ఆదిలక్ష్మీ! మనం ఇక్కడ ఉండడంలేదు. మన పల్లెకు పోదాం. అక్కడ పాత ఇంట్లో బాబాయితో భాగంగా వచ్చిన మూడు గదులూ మనకు సరిపోతాయి. ప్రశాంతంగా పల్లెలో అయిన వాళ్ల మధ్య కులాసాగా కాలక్షేపం చేద్దాం. ఆ ఏర్పాట్లు చూడు" అన్నాడు మరో ప్రశ్నకు తావివ్వకుండా భోజనం దగ్గర నుండి లేచి బయటకు వెడుతూ.

★★★

పల్లెకు మకాం మార్చిన ప్రసాదమూర్తి తన బాల్యమిత్రుడి రైసు మిల్లులో గుమస్తాగా చేరాడు. కాలక్షేపంగా ఉంటుందని భార్యకు నచ్చచెప్పాడు. కొడుకులకు ఎటువంటి సహాయం అవసరంలేదని తెలియజేసాడు.





## చేపలకూర ఇష్టం

మోడల్‌గా, నర్తకిగా ఎంతో అనుభవాన్ని సంపాదించిన అసిన్ తెలుగు సినిమాల్లో నటించి అందరి అభిమానాన్ని సంపాదించుకుంది. తల్లిదండ్రుల్ని వదిలి ఎక్కువ కాలం దూరంగా ఉండలేనని చెప్పే అసిన్‌కి న్యూజిలాండ్‌లో గడపడం ఎంతో ఇష్టం అంటోంది. చేపల కూర, కేరళ ఫుడ్ ఎక్కువగా తినే అసిన్ జీన్స్, టీ షర్ట్‌లు ఎక్కువగా ధరిస్తుంది. సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువగా ఉండే అబ్బాయిల్ని తానెక్కువగా ఇష్టపడతానని చెప్పే అసిన్ ఇంగ్లీషులో గ్రాడ్యుయేషన్ చేసింది. అందుకేనేమో ఇంగ్లీషులో గలగలా మాట్లాడుతుంది. బాలకృష్ణతో 'లక్ష్మీనరసింహా'లో నటిస్తున్న అసిన్‌ని తెలుగు ప్రేక్షకులు బాగానే ఆదరిస్తున్నారు. ముమ్ముందు ఆ ఆదరణ ఎలా ఉంటుందో చూద్దాం.

ఆ రోజు ప్రసాదమూర్తి రైసుమిల్లులో ఉండగా తనను వెతుక్కుంటూ తనతో నాటక సమాజంలో పని చేసిన నాటక రచయిత రామకృష్ణ "నమస్కారం గురువుగారూ!" అంటూ ఎదురుగా నిలబడ్డాడు.

"గురువుగారూ! నాకు సినిమా డైరెక్టు చేసే అవకాశం వచ్చింది. మనం ఎన్నో ప్రదర్శనలిచ్చి అవార్డులు గెలుచుకున్న 'జీవన సమరం' నాటకాన్ని తెరకెక్కిస్తున్నాను. అందులో తండ్రి పాత్ర మీరు చెయ్యాలన్నది నా కోరిక. ఆ పాత్రలో మిమ్మల్ని తప్ప మరొకరిని నేను ఊహించుకోలేకపోతున్నాను. ఆ పాత్ర రూపకల్పన చేసిందే మీ స్ఫూర్తితో. మీరు నా మాట కాదనకూడదు" అంటూ ప్రాధేయపడ్డాడు.

ప్రసాదమూర్తి శిష్యుడి మాట కాదనలేకపోయాడు. జీవన సమరం చిత్రంలో తండ్రి పాత్ర పోషణకు అంగీకరించాడు. చిత్ర నిర్మాణం శరవేగంగా జరిగింది. నటుడిగా ప్రసాదమూర్తి విశ్వరూపం ప్రదర్శించాడు. రంగస్థలం మీద తాను పోషించిన వందలాది పాత్రల అనుభవసారాన్ని రంగరించి తాను ధరించిన తండ్రి పాత్రలో జీవించాడు. చిత్రం విడుదలకు ముందే పరిశ్రమలో ఆయన పేరు మారుమ్రోగిపోయింది.

కొత్త చిత్రాలలో అవకాశాలు వచ్చాయి. ఇక చిత్రసీమలో పూర్తి స్థాయి నటుడిగా నిలదొక్కుకోగలనన్న ధీమా కుదిరాక ఆదిలక్ష్మితోసహా హైదరాబాదుకు మకాం మార్చాడు.

'జీవన సమరం' చిత్రం విడుదల అయింది. అఖండ విజయం సాధించింది. చేతి నిండా పని, లక్షల్లో సంపాదన. నటుడిగా ప్రసాదమూర్తికి అవకాశాలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి.

సినీ నటుడిగా ప్రసాదమూర్తినిలదొక్కుకోగలగడం కొడుకులకు చాలా ఆనందంగా వుంది. అందరి మధ్యా తమకు ప్రత్యేకమైన గుర్తింపు మరీ సంతోషదాయకంగా వుంది. భార్యాపిల్లలతో తల్లిదండ్రుల చుట్టూ ప్రదక్షణాలు ప్రారంభించారు.

"నాన్నగారికి ఇష్టమని పులిహోర తీసుకువచ్చాను" అంటూ పెద్దకొడుకు చైతన్య, "నాన్నకు ఇష్టమని నేతి గారెలు తెచ్చాను" అంటూ చిన్నకొడుకు కిరణ్ పోటీపడి తండ్రిమీద ప్రేమను కురిపిస్తున్నారు.

"ఈ వయసులో మీరు ఒంటరిగా ఉండడం ఏమీ బాగుండలేదు. మా ఇంటికి వచ్చేయండి. మేము ఊళ్ళో ఉండగా మీరు వేరే ఉండడం బాగుండలేదు. చూసేవాళ్లు ఏమనుకుంటారు?" అన్నాడు పెద్దకొడుకు చైతన్య.

"నాన్నగారి ఆరోగ్యం అసలే మంచిదికాదు. నేను సెలవుపెట్టి కాల్‌షీట్ల వ్యవహారం చూస్తాను" అంటూ చిన్నకొడుకు కిరణ్ తల్లితో తండ్రికి వినబడేలా వత్తిడి ప్రారంభించాడు.

కోడళ్ళు అత్తమామల్ని తమతో వుంచుకుని మామగారి సంపాదనతో మంచి ఫ్లాటు, వంటి నిండా బంగారు నగలు, పట్టుచీరలు సమకూర్చుకోవాలని ఆత్రంగా ఉన్నారు. ప్రసాదమూర్తి ఇల్లు పిల్లపాపలతో కళకళలాడుతోంది.

కొడుకుల నైజం గ్రహించిన ప్రసాదమూర్తి నవ్వుకున్నాడు. వాళ్ల మధ్యనే కూర్చుని సాధికారంగా ఓ ప్రకటన చేసాడు.

"చూడండి! నా సంపాదనను కన్నబిడ్డల నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులకు ఆసరాగా వుండే ఓల్డేజ్ హోం నిర్వహణకు వినియోగిద్దామనుకుంటున్నాను."

ప్రసాదమూర్తి మాటలు విని కొడుకులు, కోడళ్ళు షాక్ అయ్యారు. తెల్లబోయి ఏమీ మాట్లాడలేక నిలబడిపోయారు.

"అయ్యో అదేమిటండీ?" అంది ఆదిలక్ష్మి కంగారుగా భర్త నిర్ణయానికి ఆశ్చర్యపోతూ.

"సరే ఆదిలక్ష్మి నీ కోసం నా నిర్ణయంలో చిన్న మార్పు చేసుకుంటాను" అంటూ కొడుకులవైపుకు తిరిగి "మీ అమ్మకు ఓ కోరిక బలంగా వుండిపోయింది. మీ అందరితో కలసి ఉండాలన్నదే నన్ను కోరిన ఒకే ఒక్క కోరిక. మీకు అభ్యంతరం లేకపోతే మనమంతా కలసి ఉందాం. నా ఆర్జనలో సగ భాగం మీకు, మీ పిల్లలకు అవసరమైన ఏర్పాట్లకు వినియోగిస్తాను. ఇది నా నిర్ణయం. మీకు ఇష్టమైతే చెప్పండి" అన్నాడు ప్రసాదమూర్తి.

"సరే నాన్నా! మేము మీతోనే వుంటాం" అన్నారు ఇద్దరూ.

"నాకోసం నాటకాలవాళ్ళు వచ్చిపోతుంటారు. బాగా ఆలోచించుకోండి" అన్నారు పెద్దకొడుకు ముఖంలోకి చూస్తూ.

"క్షమించండి నాన్నగారూ. ఇక మీదట మీ మనస్సుకు కష్టం కలిగించం" అన్నారిద్దరూ.

తాను నమ్ముకున్న కళామతల్లి తనకు ఉపాధి కల్పించడమే కాకుండా జీవిత చరమాంకంలో ఓ సమర్థుడైన తండ్రిగా సగర్వంగా నిలబడే అవకాశం ఇచ్చింది. తాను 'తండ్రి పాత్ర'కు పూర్తి న్యాయం చెయ్యగలిగానన్న తృప్తితో ఆదిలక్ష్మివైపు ప్రేమగా, గర్వంగా చూసాడు ప్రసాదమూర్తి.

★

